క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



తెనాలిఅర్బన్: పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎంతో కృషి చేస్తుందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని కొత్తపేటలోని అసోసియేషన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా ఇటీవల మరణించిన సభ్యులు అప్పారావు మృతికి సంతాపం తెలిపారు. అలాగే 50వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సభ్యులు ఎస్ అరుణప్రభ, రంగసాయి దంపతులను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గరికపాటి సుబ్బారావు, పినపాటి రశికుమార్, సోమయ్య శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో రెండిళ్లలో చోరీ

తెనాలిరూరల్: వేర్వేరు ఘటనల్లో రెండిళ్లలో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ రామలింగేశ్వరపేట కూచిమంచి వారి వీధికి చెందిన వజ్రాల రామకృష్ణ మంగళవారం సాయంత్రం విజయవాడ వెళ్లి రాత్రి పొద్దుపోయాక వచ్చాడు. ఇంటి వెనుక గడియ విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి పరిశీలించగా ఇంట్లోని బీరువాలో ఉంచిన సుమారు రూ.1.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మరో ఘటనలో బాలాజీరావుపేటకు చెందిన పసుపులేటి పోతురాజు కుటుంబసభ్యులు ఇంట్లో నిదిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక వెనుక తలుపు గడియ తీసుకుని లోనికి ప్రవేశించిన దుండగుడు బీరువాలోని రూ. లక్ష నగదు, రూ. లక్ష విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లాడు. రెండు కేసులను వన్‌టౌన్, త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు ఘటనల్లో నగదు, విలువైన ఆభరణాలు ఉంచిన బీరువాల తాళాలు వాటికే ఉంచడంతో చోరులు సునాయాసంగా తమ పని కానిచ్చుకెళ్లాడు. తాళాలనైనా భద్రపరచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

పరిపాలన భవనం ఆధునికీకరణకు శ్రీకారం

తెనాలిటౌన్: స్థానిక చెంచుపేటలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని పరిపాలన భవనం ఆధునికీకరణ పనులకు బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.25 లక్షలతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. మంజూరైన నిధులతో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే శివకుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు మేలు జరిగే విధంగా యార్డు కార్యకలాపాలు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుపక్షపాతిగా పరిపాలన చేస్తున్నారని గుర్తుచేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ అవుతు సీత నగేష్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ డీఈఈ శ్రీనివాస రెడ్డి, ఏఈ సాంబనాయక్, ఉన్నత శ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, యార్డు వైస్‌చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, గుదిబండి రమేష్‌రెడ్డి, శేఖరరెడ్డి, సురేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాల్లో ఎలుకల మందు పంపిణీ



తెనాలిటౌన్: మండల గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో బుధవారం రైతులకు ఎలుకల మందు ప్యాకెట్లను పంపిణీ చేశారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆర్బీకేల్లో రైతులతో కలిసి ఎలుకలమందు తయారుచేసి ప్యాకెట్లను రైతులకు అందజేసినట్టు మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్ చెప్పారు. మల్లెపాడు గ్రామంలోని ఆర్బీకేలోనూ ఈ మందు పంపిణీ చేశామన్నారు. కొలకలూరులోని ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు, రైతులు కలిసి ఎలుకల మందును తయారుచేశారు. రైతులు నూనె, నూకలు తీసుకువచ్చారు. అధికారులతో కలిసి మందును కలిపారు. గ్రామంలోని రైతులందరికీ ప్యాకెట్లను పంపిణీ చేసినట్టు వీఏఏ నాగరాజు చెప్పారు. కేఎల్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆదర్శ రైతులు అంచే రోశయ్య, వేజండ్ల వెంకటేశ్వరరావు, ముత్తే వెంకటేశ్వరరావు, దూళ్ల సుధాకర్, ప్రసాద్, కె.మోహనరావు పాల్గొన్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లోనూ ఆర్బీకేల్లో ఎలుకల మందును తయారుచేసి గ్రామాల్లోని రైతులకు మందు ప్యాకెట్లను అందజేసినట్టు ఏవో తెలియజేశారు.

ఆరోగ్యవంతమైన సమాజమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే శివకుమార్
- వల్లభాపురంలో సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



వల్లభాపురంలో సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఈసీజీ తీస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

వల్లభాపురం(కొల్లిపర): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలోని గ్రామ సచివాలయం1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే శికుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం-1 పరిధిలో 2893 మంది జనాభా ఉంటే 1210 గృహాలు ఉండగా గత 15 రోజులు నుంచి వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగినట్లు వివరించారు. వారందరికీ ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తూ ఆరోగ్య సమస్యలపై ప్రజల నుంచి నమోదు చేసుకుంటూ సుమారు 800 మందికి ఈరోజు వైద్య శిబిరంలో ఉన్నత వైద్యుల చేత మళ్లీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. అనారోగ్యంతో తీవ్రంగా దెబ్బతిన్న రోగులను జిల్లా వైద్యశాలకు స్థానిక ప్రాథమిక వైద్యశాలలోని వైద్యులు స్వయంగా తీసుకువెళ్లి వారికి సరైన చికిత్స అందించటం జరుతుందని తెలిపారు. శిబిరంలో అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో రోగుల పేర్లు నమోదు చేసి ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యం అందించటం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ వల్లభాపురం నిర్మల, ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, వంగా సుధాకర్ రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసుధ, డాక్టర్ ప్రియాంక, ఎంపీడీవో వి.విజయలక్ష్మి , తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీటీసీలు, ఎఎన్ఎమ్‌లు, ఆషా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దంతలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

దంతలూరు(కొల్లిపర): మండలంలోని దంతలూరు గ్రామంలో మున్నంగి గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష డోర్ హెల్త్ సర్వేలో ముందుగానే గుర్తించిన రోగులు మాత్రమే వైద్య శిబిరానికి వచ్చి వివిధ ఏడు రకాల వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరం దంతలూరు గ్రామంలోని విలేజ్ హెల్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్ని వైద్య శిబిరం ప్రారంభిస్తారని తెలిపారు. కావున రోగులు, దీర్ఘకాలిక రోగులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజారోగ్యానికి సురక్ష

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై ప్రజల్లో సంతృప్తి
- ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది
- రోగులకు 7 రకాల వైద్య సేవలు
- ముమ్మరంగా ఆరోగ్య శిబిరాలు
- పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, ఉచిత మందులు



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తమాలజీ టెక్నీషియన్



బాలుడిని పరీక్షిస్తున్న డాక్టర్ మన్మథకుమార్

తెనాలిరూరల్: అవ్వా, తాత ఆరోగ్యం ఎలా ఉంది.? తాతా రోజూ షుగర్ మాత్రలు వేసుకొంటున్నావా.. పెద్దాయనా.. బీపీ కంట్రోల్‌లో ఉంటుందా.. పెద్దమ్మా మన ఇంట్లో ఎవరికైనా జలుబు, జ్వరాలు ఉన్నాయా.. అంటూ వైద్యాధికారులు ఇంటింటికీ వెళుతూ ప్రజల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గత నెల 30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పల్లెబాట పట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి నాడి పట్టి మరీ వైద్య పరీక్షలు చేస్తున్నారు. పల్లెల్లో జగనన్న ఆరోగ్య సురక్ష జోరుగా సాగుతోంది.

సర్వే పరీక్షలు అలా..

సెప్టెంబర్ 16 నుంచి 30 వరకు కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆవ వర్కర్లు, బీపీ మిషన్లు పట్టి ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. సమస్యలకు సంబంధించి 7 రకాల వైద్య పరీక్షలు అక్కడికక్కడే నిర్వహించారు. 19 ఏళ్లు నిండిన వారికి రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయడంతో పాటు 10 ఏళ్లు దాటిన వారందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు, రెండు వారాలకు మించి దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి డెంగీ, మలేరియా, యూరిన్ పరీక్షలు ఉచితంగా చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి టోకెన్‌లు జారీ చేశారు.

శిబిరాల్లో వైద్య సేవలు ఇలా..

ప్రస్తుతం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు జరుపుతున్నారు. రోగులు, అనారోగ్య సమస్యలు ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా మెరుగైన వైద్య సలహాలు అందిస్తున్నారు. కేవలం బీపీ, షుగరు పరీక్షలే కాకుండా కంటి పరీక్షలు సైతం చేస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని వైద్యశాలలకు రిఫర్ చేస్తున్నారు. ఈ శిబిరాల్లో అందిస్తున్న సేవలపై ప్రజల్లో ముఖ్యంగా పేదల్లో ఆనందం, సంతృప్తి వ్యక్తమవుతున్నాయి. తెనాలి మండలం పెదరావూరు జెడ్పీ హైస్కూలు ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్యో సురక్ష శిబిరంలో సాయంత్రం వరకు సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీలత బాయి, డాక్టర్ హనీఫ్, తెనాలి సాలిపేట యూపీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ డీయూవీ కిషోర్, డాక్టర్ అఫీఫా (జనరల్ మెడిసిన్) డాక్టర్ జి. మన్మథకుమార్ (పీడియాట్రిక్స్), జి. లాస్య యాదవ్ (ఆప్టోమెట్రిస్ట్) వైద్య సేవలు అందించారు. కొల్లిపరలో డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ షేక్ కరిముల్లా రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అందుతున్న వైద్య సేవలపై ప్రజల్లో ముఖ్యంగా పేదల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది.

జిల్లా వైద్యశాలకు రిఫర్ చేశారు



కంటి శుక్లాలతో బాధపడుతున్నా. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నా. కళ్లలో నీటి కాసులు ఉన్నాయని చెప్పారు. తెనాలి జిల్లా వైద్యశాలలో అవసరమైన శస్త్ర చికిత్స ఉచితంగా చేస్తారని, అక్కడకు వెళ్లాలని రిఫర్ చేశారు. వైద్య పరీక్షలు చేసి మందులివ్వడం మాలాంటి వారికి ప్రయోజనకరం.

–కొమ్మాలపాటి జీవలీల, పెదరావూరు

శిబిరాలతో ఎంతో మేలు



మోకాళ్ల నొప్పులు, ఆయాసంతో బాధపడుతున్నాను. వల్లభాపురంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వస్తే వైద్యులు దగ్గరుండి నేరుగా పరీక్షలు చేయించారు. అవసరమైన మందులను ఉచితంగా ఇవ్వడంతో పాటు ఆహార నియమాలు తెలిపారు. ఇటువంటి శిబిరాల వల్ల మాలాంటి వారికి మేలు కలుగుతుంది.

–కోలా సావిత్రి, వల్లభాపురం

పేదలకు ఎంతో ఉపయోగం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంతో పేదలకు ఎంతో మేలు. వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే వందలు /వేలల్లో ఖర్చు అవుతుంది. వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి వైద్య పరీక్షలు చేయడమే కాకుండ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి నేరుగా వైద్యులే పరీక్షించి మందులు రాస్తున్నారు. బీపీ, దగ్గు, ఆయాసానికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

–వల్లభాపురం తాతారావు, వల్లభాపురం

వివక్ష లేకుండా సంక్షేమ పథకాల అమలు

- కొలకలూరులో పేదలకు రూ.50 కోట్ల సంక్షేమ లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శివకుమార్



ఖాజీపేటలో మహిళకు లబ్ధి చేకూరిన పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేకుండా లబ్ధిని చేకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారా? లేదా? అనేది చూడకుండా పేదలైన అందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని స్పష్టంచేశారు. కేవలం కొలకలూరులోనే రూ.50 కోట్ల నగదును అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామని చెప్పారు. కొలకలూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం కొనసాగించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఉదయాన్నే సమీప ఖాజీపేటలో ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటినీ సందర్శించారు. ప్రతి గృహస్తుని పలకరించారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అందించిన సంక్షేమ లబ్ధిని వెల్లడించారు. ఆ కుటుంబీకుల సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్టు చెబుతూ కేవలం ఖాజీపేటలోని 221 కుటుంబాలకు కాపు నేస్తం పథకం కింద వారి ఖాతాల్లో నగదు జమచేసినట్టు గుర్తుచేశారు. గ్రామంలోని ఇతర సమస్యలపైనా ఆరా తీశారు. మురుగు కాల్వలకు సైడ్ వాల్స్ నిర్మింపజేయాలని, దెబ్బతిన్న రోడ్లను నిర్మించాలని ఈ సందర్భంగా పలువురు విజ్ఞప్తి చేశారు. వారి వినతులను పరిగణనలోకి తీసుకుంటామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఆశ్రమానికి వెళ్లే దారిలో 150 మీటర్ల పొడవునా నెలరోజుల్లో నిర్మిస్తామని చెప్పారు. అదేవిధంగా హాఫ్‌పేట నుంచి హనుమాన్‌పాలెం వరకు మెయిన్‌రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తయినట్టు ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. రెండునెలల్లో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు చెక్కా సీతమ్మ, కాలిశెట్టి ఫణికుమార్, సిగ దేవిక, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, గోపిశెట్టి వెంకయ్య, గోపిశెట్టి నాగేశ్వరరావు, మల్లవరపు విజయ్, ప్రసాదం సురేష్, పినపాటి అనిల్, రావూరి రవిబాబు, ప్రసాదం రాధారావు, వీరమల్లు కార్తికేయ, బాబి, అమీర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వోలు సురేష్, నితిష్‌కుమార్, అలీనగర్ బాషా పాల్గొన్నారు.

పూర్తికావచ్చిన పింఛన్ల పంపిణీ



వైద్యశాలలో చికిత్స పొందుతున్న మంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉషాదేవి



చిలకలూరిపేటలో సాంబశివరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు నాగలక్ష్మి

తెనాలిఅర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం తెనాలిలో చివరి దశకు చేరుకుంది. బుధవారం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వికలాంగ, వితంతు, వృద్ధాప్య, డయాలసిస్ వంటి పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎన్వీఆర్ కాలనీ పరిధిలోని ఉప్పలపాటి సాంబశివరావు అనారోగ్యంతో బాధపడుతూ చిలకలూరిపేటలోని కుమార్తె వద్ద ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ నాగలక్ష్మి అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. అలాగే సుల్తానాబాద్ సచివాలయ పరిధిలో నివశిస్తున్న పడవల బేబి అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ పి శాంతి అక్కడికి వెళ్లి వికలాంగ పింఛన్‌ను పంపిణీ చేశారు. అలాగే లింగారావు సెంటర్ సచివాలయ పరిధిలోని నల్లగొర్ల మంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ ఉషాదేవి అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను పంపిణీ చేశారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో అధిక దిగుబడులు



రైతులకు వివరిస్తున్న జేడీఏ విజయభారతి

కొల్లిపర: రైతులు కలసికట్టుగా ఉండి ఒకేసారి సామూహిక ఎలుకల నిర్మూలనతో వరి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని జేడీఏ విజయభారతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొల్లిపర పాలకేంద్రం కల్యాణ మండపంలో రైతులకు వరి పంటలో సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించి బ్రోమోడయోలిన్ ఎలుకల మందు నూకలు, విషపు ఎరలో ఏవిధంగా పంట చుట్టూ పెట్టాలి అన్న అంశాలపై సూచనలు, సలహాలు అందించి ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామూహికంగా వరి పంటలో ఎలుకలను నివారించక పోతే వరి పొట్ట దశలో ఎక్కువ శాతం ఎలుకలు దుబ్బుల కొరకటం వలన పంట దిగుబడిలో రైతులు నష్టపోయే ప్రమాదముందన్నారు. ఇప్పటి నుంచి వరి గట్ల మీద ఎటువంటి గడ్డి లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి నుంచి రైతులు అందరూ మరో వారం రోజుల లోపు ఆయా రైతుభరోసా కేంద్రాలలో వ్యవసాయాధికారులు సూచనలు మేరకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఎలుకల మందు ద్వారా నూకలు, నూనె, విషపు ఎరలు ద్వారా సామూహికంగా ఒకేరోజు మందును మాగాణి భూముల్లోని బోరియల్లో వేయాలని తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి వరి పంట భూములను పరిశీలించి, రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు.రైతులు ఎలుకల మందు కావల్సిన వారు ఆయా గ్రామాలల్లోని ఆర్బీకే కేంద్రాలలో ఉన్న సిబ్బంది కలసి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఏటీఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరామాంజనేయులు, ప్రధాన శాస్త్రవేత్త నగేష్, డీడీఏ రత్నమంజుల, ఏడీఏ ఉషారాణి, మండల వ్యవసాయాధికారి వెంకటరావు రైతులు పాల్గొన్నారు.

మందుబాబులపై కేసులు

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం నందివెలుగు ప్రధాన కూడలి సమీపంలో, కొలకలూరు వంతెన వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఐదుగురిని రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు.

రెండోరోజుకు చేరిన సీపీఎం పాదయాత్ర

తాడేపల్లిరూరల్ : సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర తెల్లక్వారీ మీదుగా రామయ్య కాలనీ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాదయాత్ర బృందం నాయకులు పాశం రామారావు మాట్లాడుతూ తమ పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందని, ప్రధానంగా రైల్వే స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారిని పట్టాలు ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో సీపీ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారా వు, ఎం .రవి, వై. నేతాజీ, పాదయాత్ర బృందం నాయకులు ఎం.సూర్యారావు, బూరగ వెంకటేశ్వర్లు, దుర్గారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చెంగయ్య, రాజధాని నాయకులు పాల్గొన్నారు.

భగవంతుడిని నమ్ముకున్న భక్తులకు అంతా శుభమే



అనుగ్రహ భాషణ చేస్తున్న స్వామి

తెనాలి: భగవంతుడిని నమ్ముకున్న భక్తులకు ఎలాంటి కీడు జరగదని విజయవాడ అష్టాక్షరి ఆశ్రమానికి చెందిన శ్రీత్రిదండి అష్టాక్షరి సంపత్కుమర రామానుజ జీయర్‌స్వామి చెప్పారు. స్థానిక బోసురోడ్డులోని గీతామందిరంలో బుధవారం సాయంత్రం భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. బృందావనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహణలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. భక్తులంతా సామూహిక భగవన్నామ సంకీర్తన చేయటం మంచిదన్నారు. కర్నూలుకు చెందిన నాగరాజు గుప్త, గుంటూరు నుండి టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామర్ అమ్మడు, తెనాలి నరేంద్రస్వామి భక్తులకు ప్రవ చనం బోధించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కొండపి వసుంధర, కేశవ, లక్ష్మరాజు కనకదుర్గ, మాదాల సత్యకుమారి, కారంపూడి రమాదేవి పాల్గొన్నారు.

సురక్ష క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి



సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి గాయత్రీదేవి, డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: పట్టణంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సురక్ష కార్యక్రమ తెనాలి పట్టణ నోడల్ ఆఫీసర్ అంగలకుదురు గాయత్రిదేవి, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె హెలెన్ నిర్మలలు సూచించారు. అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాల్‌ను బుధవారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం పొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాల్‌లో సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. 1,2,3,40,41,42 ,43,44, 45,46,47 సచివాలయాల పరిధిలోని పేద ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే అక్కడ వైద్య శిబిరం కోసం చేసి న ఏర్పాట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ పోతుల ఉషారాణి, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమార్, సిబ్బంది శ్యామ్, అందే బాలచంద్రమౌళి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి తెనాలిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లు

జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను గురువారం నుంచి తెనాలి పట్టణంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ క్యాంప్‌లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. వివిధ రకాల స్పెషలిస్ట్ వైద్యులు క్యాంప్‌లలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అలాగే పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా ఉచితంగా చేయటం జరుగుతుందని వివరించా రు. తెనాలి పట్టణంలో గురువారం అయితానగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాల్‌లో, ఈనెల 6న (శుక్రవారం) బుర్రిపాలెం రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో, ఈనెల 7న (శనివారం) మారీసుపేట లోని ఎన్‌సీఆర్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో, ఈనెల 9న (సోమవారం) పాండురంగపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలి

నిడుముక్కల(తాడికొండ): చిరుధాన్యాలను ఆహారంలో చేర్చడం ద్వారా మధుమేహం, ఊబకాయం, రక్తహీనత వంటి వ్యాధులను నివారించవచ్చని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ చైతన్య కుమారి అన్నారు. భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో చిరుధాన్యాలతో విలువ జోడింపు ఉత్పత్తుల తయారీపై 5 రోజుల పాటు జరగనున్న శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్సీ మహిళలకు చిరుధాన్యాలను ఉపయోగించి వివిధ ఆహార పదార్థాలను తయా రు చేసే విధానాన్ని వివరించారు. గ్రామీణ మహిళలలో చిరుధాన్యాల ప్రాముఖ్యత వినియోగం ద్వారా వారిలో పోషణ స్థాయిని పెంపొందించి జీవనశైలి వ్యాధులను అరికట్టడమే సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో దత్తత గ్రామ కో ఆర్డినేటర్ డాక్టర్ ధనశ్రీ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ బి.కృష్ణకుమారి, బోధనా సిబ్బంది ప్రొఫెసర్ డాక్టర్ బిల్కిస్, డాక్టర్ జి నిర్మాలాదేవి, డాక్టర్ ఎ పూర్ణిమ, అంగన్‌వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.